క్లుప్తంగా

సంపరలో సిద్ధి వినాయకుడికి పంచామృతాభిషేకాలు



సంపరలో ప్రత్యేక అలంకరణలో వినాయకుడు

పెదపూడి: గణేష్ నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా సంపర గ్రామంలో పంట కాలువ సమీపంలో ఉన్న సిద్ధి వినాయకునికి బుధవారం గరికె, పంచామృతాభిషేకాలు చేశారు. భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని అన్ని గ్రామాల్లో వినాయక మంటపాల్లో గణనాథునికి ప్రత్యేక పూజలు చేశారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి



నాగమణి, ఐసీడీఎస్ సీడీపీఓ, రాజానగరం

రాజానగరం: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలలో ఉన్న ఖాళీలను భర్తీ చేసేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ప్రాజెక్టు సీడీపీఓ టి.నాగమణి బుధవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. రాజానగరం మండలంలో మూడు అంగన్‌వాడీ కార్యకర్త పోస్టులు, రెండు సహాయకుల పోస్టులు, రాజమహేంద్రవరం రూరల్ మండలంలో 5 సహాయకురాలు పోస్టులు, కడియం మండలంలో 3 సహాయకురాలు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఆసక్తి, అర్హత ఉన్న వారు ఈనెల 20, సాయంత్రం 5 గంటల్లోగా తమ దరఖాస్తులను రాజానగరంలోని తమ కార్యాలయానికి అందజేయాలన్నారు.

20 వరకు దరఖాస్తులకు గడువు

సీతానగరం: కోరుకొండ, సీతానగరం మండల అంగన్‌వాడీ సెంటర్లలో ఆయా పోస్టులకు ఈ నెల 20 వరకు దరఖాస్తుల స్వీకరణకు గడువు ఉందని కోరుకొండ ఐసీడీఎస్ సీడీపీవో జె.ఝాన్సీరాణి బుధవారం తెలిపారు. కోరుకొండ మండలం గాదరాడ-2 ఎస్టీ, కనుపూరు -5, బీసీ బి, కోటి -2 ఓసీ, బూరుగుపూడి-1 ఎస్సీ, నరసాపురం-1 ఓసి, సీతానగరం మండలం రఘుదేవపురం-2 ఓసీ లు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ పోస్టులకు స్థానిక వివాహిత అభ్యర్థినులు మాత్రమే అర్హులన్నారు. పదవ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, ఈ ఏడాది జూలై ఒకటికి 21 ఏళ్లు నిండి, 35 ఏళ్ల లోపువారై ఉండాలన్నారు. నివాస ధ్రువీకరణ పత్రాలు దరఖాస్తుకు జత చేయాలన్నారు. ఈ నెల 20వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు గడువు ఉందని, దరఖాస్తులను నేరుగా కోరుకొండ ఐసీడీఎస్ కార్యాలయంలో అందించాలని సీడీపీవొ ఝాన్సిరాణి వివరించారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సీతానగరం: లైన్ మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు సందర్భంగా సీతానగరం రూరల్ 11 కేవీ ఫీడర్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని రాజమహేంద్రవరం రూరల్ ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దాట్ల శ్రీధర్ వర్మ గురువారం తెలిపారు. వంగలపూడి, సింగవరం, పెదకొండేపూడి, చీపురుపల్లి, అచ్చయ్యపాలెం గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ నిలిపివేయనున్నట్టు ఆయన తెలిపారు.

నీటి కాలువ ఏర్పాటు



సీతానగరం డిగ్రీ కళాశాల్లో నీరు తరలివెళ్లడానికి కాలువ తవ్వుతున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు నీటి కాలువను తవ్వారు. బుధవారం డిగ్రీ కళాశాల ప్రాంగణంలోకి నీరు చేరుకోవడంతో నీరు తరలివెళ్లడానికి కామర్స్ బ్లాక్ వరకు ఎన్ఎస్ఎస్ విద్యార్థులు నీటి కాలువను తవ్వారు. దీంతో కళాశాలలో ఉన్న ఇతర ప్రాంతాల నుంచి వచ్చే నీటి సమస్య పరిష్కారం అయింది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చిట్టిబాబు, ఎన్ఎస్ఎస్ పీవో డాక్టర్ ఎం.సుధామయి, అధ్యాపకులు పాల్గొన్నారు.

స్వామి వివేకానంద ఉపన్యాసానికి 131 ఏళ్లు

సీటీఆర్ఐ: స్వామి వివేకానంద 1893 సంవత్సరం సెప్టెంబర్ 11న చికాగో నగరంలో విశ్వమత మహాసభలో చారిత్రాత్మక ఉపన్యాసం ఇచ్చి బుధవారంతో 131 ఏళ్లు అయ్యిందని స్వామి శశికాంతానందజీ మహారాజ్ అన్నారు. స్థానిక కంబాలచెరువు వద్ద గల స్వామి వివేకానంద విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శారదాదేవి స్కాలర్‌షిప్ టెస్ట్ విజేతలకు నగదు బహుమతులు, సర్టిఫికెట్లు, వివేకానంద ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ ఎక్స్‌లెన్స్ 36వ బ్యాచ్ విద్యార్థులకు కోర్సు సర్టిఫికెట్లు అందచేశారు. కార్యక్రమంలో స్వామీజీలు పరిజ్ఞేయానందజీ, వేదవిద్యానందజీ, రఘువీరానందజీ, డాక్టర్ గోలి రామారావు తదితరులు పాల్గొన్నారు.

కొండ గోదావరి ఎగపోట్లు

- మూడోసారి నీట మునిగిన పంటలు
- రైతుల కంట కన్నీరు

సీతానగరం: కొండ గోదావరి మళ్లీ విజృంభించింది. పంట పొలాలను ముంచెత్తింది. గోదావరిలో వరద ఎక్కువగా ఉన్న కారణంగా బొబ్బిల్లంక వద్ద స్లూయిజ్ గేట్లు మూసుకుపోయాయి. దీంతో కొండ గోదావరి ప్రవాహం వెనుకకు రావడంతో మళ్లీ పంటలు నీట మునిగాయి. ఇప్పటికే రెండు సార్లు కొండ గోదావరి ఎగపోటు కారణంగా పంటలు నీట మునిగాయి.

ఇప్పుడు ముచ్చటగా మూడోసారి కూడా రైతులను ఇబ్బందుల్లోకి నెట్టింది. దీంతో రైతులు ఇక ఖరీఫ్ సాగు అసాధ్యమని కంటతడి పెడుతున్నారు. జూలై నుంచి గోదావరి వరద పలుమార్లు తగ్గి, ఉధృతంగా మవుతోంది. అప్పటి నుంచి సీతానగరం మండల గ్రామాల్లో ముంపులో ఉన్న పొలాలు సుమారు 3 వేల ఎకరాలు ఇంకా తేరుకోలేదు. మళ్లీ గోదావరి వరద ఉధృతమవడంతో తిరిగి బొబ్బిల్లంక స్లూయిజ్ డోర్లు మూసుకుపోయాయి.

అధిక వర్షాలతో నీరు గోదావరిలో కలవడానికి మార్గం లేకపోవడంతో కొండ గోదావరి ఎగపోటుతో మూడోసారి వరి పొలాలు ముంపులోకి వెళ్లాయి. ఒకసారి అంటే భరించవచ్చని, పలుమార్లు నష్టాలు కలిగితే ఎలా భరించేదదని రైతులు వాపోతున్నారు.



మిర్తిపాడులో కొండ గోదావరి ముంపులో వరి పంట పొలాలు

5వేల ఎకరాలకు ముంపు

గోదావరి వరద, అధిక వర్షాలతో మళ్లీ అయిదు వేల ఎకరాలు ముంపులోకి వెళ్లింది. ఇందులో సుమారు 2 వేల ఎకరాలు రెండో సారి వరినాట్లు వేయగా అది కూడా ముంపులో ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ సారి పంట వేసే ఆలోచన లేదని, ఇక రబీలో వేసే పంటలే వేయాలనే యోచనలో రైతులు ఉన్నారు. ఎకరం రూ.30 వేలు నుంచి రూ.40 వేల వరకు కౌలుకు తీసుకుని వరినాట్లు వేసిన రైతులు లబోదిబోమంటున్నారు. మండలంలో రామచంద్రపురం, వంగలపూడి, సింగవరం, చినకొడేపూడి, రాపాక, రఘుదేవపురం, నల్గొండ, మిర్తిపాడు, ముగ్గళ్ళ, ఇనుగంటివారిపేట, వెదుళ్లపల్లి, మునికూడలి, కాటవరం, బొబ్బిల్లంక, కూనవరం తదితర గ్రామాల వరిపొలాలు ముంపులో ఉన్నాయి. అలాగే కోరుకొండ మండలంలో ఎనిమిది గ్రామాలకు చెందిన పంట పొలాలు ముంపులో ఉన్నాయి. ఈ నష్టంపై అధికారులు అంచనాలను త్వరగా వేయాలని, ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

అంతా నష్టమే..



మూడు ఎకరాలలో వరి పంట వేశాను. అంతా ముంపుబారి పడింది. రెండు సార్లు పంట వేశాను. మళ్లీ ఇప్పుడు కూడా ముంపులోకి వెళ్లింది. అంతా నష్టమే. మూడోసారి వరినాట్లు వేయడానికి వరి నారు సిద్ధంగా లేదు. అందులోను ఇప్పుడు వేస్తే అధిక పెట్టుబడితోపాటు, దిగుబడి అంతంత మాత్రంగానే ఉంటుంది. నేరుగా రబీలో వేసే మొక్కజొన్న వేసుకుంటా. అంతా నష్టమే. ప్రభుత్వం ఆదుకోవాలి.

– గద్దె వీరన్నబాబు, రైతుల, రామచంద్రపురం

రెండుసార్లు వరినాట్లు వేశా



రెండు ఎకరాలు కౌలుకు తీసుకుని వరిపంట వేశాను. ముంపులోకి వెళ్లితే రెండుసార్లు వరినాట్లు వేశాను. ఇప్పుడు మూడోసారి కూడా ముంపులోకి వెళ్లింది. ఇప్పటి వరకు ఎకరానికి రూ.40 వేలు పెట్టుబడి పెట్టాను. అంతా నష్టపోయాను. రెక్కాడితే కాని డొక్కాని బతుకులు. అందినకాడికి అప్పులు తెచ్చి పెట్టాను. ఇబ్బంది పడుతున్నాను.

– దొక్కా నాగేశ్వరరావు, కౌలు రైతు, మిర్తిపాడు

రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక



చాందిని శ్రీయ



సాయి సింధూ



వెంకట వినయ్

బిక్కవోలు: స్థానిక ఉన్నత పాఠశాల చెందిన ముగ్గురు క్రీడాకారులు సబ్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ ఎం పల్లా వీర ప్రభాకర్‌రావు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ బాలికలు విభాగం నుంచి బండారు చాందిని శ్రీయ, విసినిగిరి సాయి సింధూ, బాలురు విభాగం నుంచి బొడ్డు వెంకట వినయ్ ఎంపికయ్యారని తెలిపారు. ఈ నెల 13వ తేదీ నుంచి 15 వరకు అన్నవరంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులు ప్రస్తుతం జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ శిక్షణ శిబిరంలో ఉన్నారన్నారు. విద్యార్థులను పాఠశాల పీడీ మానుకొండ ధనరాజ్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు క్రీడాకారులను అభినందించారు.

నలుగురికి శస్త్ర చికిత్సలు



శస్త్ర చికిత్స చేయించుకున్న మహిళతో మాట్లాడుతున్న జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి వెంకటేశ్వరరావు

రాజానగరం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సల వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఇందులో పీహెచ్‌సీ వైద్యులు జి.రామభాస్కర్, డాక్టర్ టి.ఉదయ్ఏంజెల్ ఆధ్వర్యంలో నలుగురికి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేశారు. ఇదే సమయంలో పీహెచ్‌సీని సందర్శించిన జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు వారి సేవలను అభినందించారు. ఆపరేషన్లు చేయించుకున్న వారితో మాట్లాడారు. అనంతరం ఆస్పత్రిలో రికార్డులను పరిశీలించి, రోగులకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. ప్రస్తుతం వాతావరణ మార్పులతో సంభవిస్తున్న వైరల్ ఫీవర్స్ పట్ల అంతా అప్రమత్తంగా ఉండాలని, నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ అవసరమైన వారికి సకాలంలో వైద్య సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. డాక్టర్ సీహెచ్ వెంకటలక్ష్మి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పశ్చిమ ఏలేరులో తగ్గని వరద ఉధృతి

పెదపూడి: మండలంలో ఏపీత్రయం గ్రామంలోని వంతెన వద్ద పశ్చిమ ఏలేరు కాలువ వరద ఉధృతి మూడో రోజూ తగ్గలేదు. దీంతో రామేశ్వరం, ఏపీత్రయం గ్రామాల్లో సుమారు 2వేల ఎకరాల్లో వరి పంట నీట ముంపునకు గురైంది. గత సోమవారం నుంచి ఏలేశ్వరంలోని రిజర్వాయర్ నుంచి ఏలేరు పశ్చిమ కాలువ నుంచి వరద ఉధృతి పెరుగుతూ ప్రవహిస్తోంది. ఈ గ్రామాల్లో తహసీల్దార్ సీతాపతిరావు, ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎం.సత్యనారాయణరెడ్డి,ఏఓ టీవీఆర్ మణిదీప్ తదితరులు అప్రమత్తంగా ఉండి వరద ఉధృతిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు. ఏపీత్రయం వంతెన వద్దకు చేరుకుంటున్న గుర్రపు డెక్క, తూడు కాడను ఎప్పటికప్పుడు తొలగిస్తున్నారు. సోమవారం నుంచి మంగళవారానికి 8 అడుగులు వరద ఉధృతి పెరగగా బుధవారం మరో అడుగు పెరిగింది. ఈ నేపథ్యంలో గురువారం కూడా వరద ఉధృతి పెరిగి గట్లకు గండి పడే అవకాశం ఉంది. ఉధృతి తగ్గితే ఏలాంటి ప్రమాదకర పరిస్థితులు ఉండవు అని స్థానికులు తెలిపారు.



ఏపీత్రయం వంతెన వద్ద ఏలేరు కాలువ వరదను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి



ఏపీత్రయంలో నీట మునిగిన వరి పొలంలో వరి దుబ్బును చూపిస్తున్న రైతు



ఏపీత్రయం వంతెన వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న ఏలేరు కాలువ

రైతులను అన్ని విధాలా ఆదుకుంటాం

మండలంలో రామేశ్వరం, ఏపీత్రయం, కరకుదురు గ్రామాల్లో పశ్చిమ ఏలేరు కాలువ వరద ఉధృతితో నీట మునిగిన వరి పొలాల రైతులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అన్ని విధాలా ఆదుకోడానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. ఆయన ఏపీత్రయం గ్రామంలో పశ్చిమ ఏలేరు వంతెన వద్ద వరద ఉధృతిని బుధవారం పరిశీలించారు. నీట మునిగిన పంట పొలాలను కూడా పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏలేరు కాలువ, బిక్కవోలు డ్రెయిన్‌ను సీఎం దృష్టికి తీసుకెళ్లి ఆధునీకరణ పనులు చేయడానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఎన్డీఏ నాయకులు, రైతులు, అరుమిల్లి సత్యభారతి ప్రసాద్, కొటికలపూడి సత్తిబాబు, సానా శ్రీను, పెండెం అప్పన్న, అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా ఏకాహం

బిక్కవోలు: కొంకుదురు మార్కెట్ సెంటర్ వద్ద గణపతి మంటపంలో బుధవారం ఏకాహం నిర్వహించారు. గణేశ్ నవరాత్రుల్లో భాగంగా ఏర్పాటు చేసిన ఈ ఏకాహంలో భక్తులు స్వామి భజనలు, పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ చిన్నం వీరభద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఐఎస్‌టీఎస్‌లో ‘ఉరుకు పటేల’ బృందం సందడి



పాటలకు డాన్సులేస్తున్న హీరో, హీరోయిన్లు, విద్యార్థులు

రాజానగరం: తూర్పుగానుగూడెం, ఐఎస్‌టీఎస్ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ఉరుకు పటేల చిత్ర బృందం హల్‌చల్ చేసింది. ఈనెల 7వ తేదీన విడుదలైన ఈ సినిమా ప్రేక్షకాదరణ పొందుతున్న నేపథ్యంలో విజయోత్సవ యాత్ర చేస్తూ బుధవారం సాయంత్రం కళాశాలను సందర్శించి, విద్యార్థులతో తమ ఆనందాన్ని పంచుకున్నారు. లవ్, కామెడీ, థ్రిల్లర్ అంశాలతో అందరినీ అలరిస్తున్న ఈ సినిమాను ప్రతి ఒక్కరూ థియేటర్‌లోనే చూడాలని హీరో తేజస్ విజ్ఞప్తి చేశారు. తన మొదటి సినిమాను హిట్ చేసిన అభిమానులకు హీరోయిన్ కుష్బూచౌదరి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా సినీమాలోని డైలాగ్స్, సాంగ్స్‌తో విద్యార్థులతో కలిసి కొద్దిసేపు సందడి చేశారు.

ఘనంగా లక్ష్మీగణపతి హోమం

- పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి

పెదపూడి: జి.మామిడాడ గ్రామం శివారు ఎల్ఏస్పురంలోని పల్లాపు వీధిలో బాలగజానన స్వామి ఆలయంలో లక్ష్మీగణపతి హోమం పూజలు ఘనంగా జరిగాయి. ఈ పూజల్లో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆయన సతీమణి ఆదిలక్ష్మి దంపతులు పాల్గొన్నారు. గణపతి హోమంతో పాటు, చండీహోమం, 108 కలశాలతో కలశాభిషేకం, 11 ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. గత 16 సంవత్సరాలుగా ఏటా ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా తులసి, ఉప సర్పంచి మేడపాటితాతారెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, మండల కన్వీనర్ గుత్తుల రమణ, సర్పంచుల సమాఖ్య మండల అధ్యక్షుడు కోసూరి వాసు, ఎంపీటీసీ సభ్యురాలు కర్రి వెంకట పద్మావతి, చింతా దొరబాబు తదితరులు పాల్గొన్నారు.



జి.మామిడాడలో గణపతి హోమం పూజల్లో స్వామి వారిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే దంపతులు

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



చినకొండేపూడి అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార వారోత్సవాలు

సీతానగరం: పిల్లలు ఆరోగ్యవంతంగా ఉండాలంటే పౌష్టికాహారం కీలకమని సీడీపీఓ ఝాన్సీరాణి అన్నారు. బుధవారం చినకొండేపూడి అంగన్‌వాడీ కేంద్రం-2లో పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సీతానగరం పీహెచ్‌సీ డాక్టర్ ఏవీకే చైతన్య పాల్గొన్నారు. సీడీపీఓ ఝాన్సీరాణి మాట్లాడుతూ, గర్భిణులు, పిల్లల కోసం అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహారం అందిస్తున్నట్టు చెప్పారు. డాక్టర్ చైతన్య మాట్లాడుతూ, గర్భిణులు ఎక్కువగా ఆకు కూరలు, పోషకాహారం తీసుకుంటే రక్తహీనత సమస్య దరిచేరదన్నారు. సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

ఖరీఫ్ దిగుబడి ఆశాజనకంగా ఉంటుంది

- ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు వెంకట నరసింహారావు, శ్రీనివాస్
- మండలంలో వరి, అపరాల సాగు పరిశీలన

రంగంపేట: ప్రస్తుత ఖరీఫ్ సాగులో పంటల దిగుబడి ఆశాజనకంగా ఉంటాయని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు, డాక్టర్ మానుకొండ శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రమైన రంగంపేట, చంద్రేడు గ్రామాల్లోని వరి, అపరాల పంటలను జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావుతో కలిసి బుధవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ వరి, అపరాల పంటలలో చీడ పీడలు సాధారణ స్థాయి కన్నా తక్కువగా ఉన్నాయన్నారు. వరి ప్రస్తుతం ఈనిక దశలో ఉందని, పంట ఆరోగ్యంగా ఉందన్నారు. అక్కడక్కడా కొన్ని ప్రాంతాల్లో మాగుడు తెగులు కనిపించిందని, దీని ఉధృతి పెరగకుండా నివారణకు హెక్సాకోనాజోల్ 2.0 మిల్లీలీటర్లు లేదా ప్రోపికోనాజోల్ 1.0 మిల్లీలీటర్లు లేదా 0.4 గ్రాముల ట్రైఫ్లాక్సీస్ట్రోబిన్, టెబ్యూకోనాజోల్ 1.5 మిల్లీలీటర్లు ఒక లీటరు నీటిలో పిచికారీ చేయాలన్నారు. అక్కడక్కడా కనిపిస్తున్న ఆకుముడత ఉధృతి పైరు పేరిగే కొద్దీ ఎక్కువయ్యే అవకాశం ఉన్నందున నివారణకు 2.0 గ్రాములు ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. స్వర్ణ ఎంటీయూ 1318 వంటి రకాలకు నత్రజని ఎరువును తగ్గించుకోవాలని రైతులకు సూచించారు. బీపీటీ 5204 లాంటి సన్న రకాలలో తెగులు ఉధృతి కనిపించే అవకాశం ఉన్నందున పైన సూచించిన మందులను పిచికారీ చేయాలన్నారు. మినుము పంటలో చిత్త పురుగులు, కాండం ఈగ నివారణకు క్లోరిపైరిఫాస్ 2.5 గ్రాములు లేదా అసిఫేట్ 1.5 గ్రాములు ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఎస్.జయరామలక్ష్మి, మండల వ్యవసాయాధికారి కూరాకుల శ్రీనివాసరావు, వీఏఏ మహేష్, రైతులు పాల్గొన్నారు.



చంద్రేడులో పంటలను పరిశీలిస్తున్న ఏరువాక కేంద్ర శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు

పురావస్తు శాఖతో ఆర్ట్స్ కళాశాల ఒప్పందం

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల చరిత్ర, పురావస్తు శాఖ, మ్యూజియం విభాగాల ఆధ్వర్యంలో బుధవారం పరస్పర స్పందన ఒప్పందం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే మాట్లాడుతూ ఈ ఒప్పందంతో పురావస్తుశాఖ మ్యూజియం విభాగం, చరిత్ర విభాగం మధ్య అవసరమైన విజ్ఞానాన్ని పంచుకోవటం, పరిశోధన కార్యకలాపాలను నిర్వహించుకోవడంలో విద్యార్థులను భాగస్వాములుగా చేసేటట్టుగా ఇరు విభాగాల మధ్య అంగీకారం కుదిరిందని చెప్పారు. ఈ రెండు శాఖల ఆధ్వర్యంలో సెమినార్ల నిర్వహణ, వివిధ రకాలైన అవగాహన కార్యకలాపాల నిర్వహణకు ఒప్పందం జరిగిందన్నారు. కార్యక్రమంలో కళాశాల పురావస్తుశాఖ మ్యూజియం అసిస్టెంట్ డైరెక్టర్ కె.తిమ్మరాజు, అకడమిక్ కో ఆర్డినేటర్ డాక్టర్ యు.రాజేశ్వరి, ఐక్యూ ఏసీ కో ఆర్డినేటర్ డాక్టర్ కేపీఏ అన్నపూర్ణ, వైస్ ప్రిన్సిపాల్ ఆర్డినేటర్ డాక్టర్ కేఎస్ శ్రీరామమూర్తి, చరిత్ర విభాగాధిపతి డాక్టర్ బి.అంజనీకుమారి, పి.తులసీకుమారి, కె.వరప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.



పురావస్తుశాఖ, మ్యూజియం విభాగాలతో ఒప్పందం కుదుర్చుకుంటున్న ప్రిన్సిపాల్ రామచంద్ర

రుడా ఇన్‌చార్జ్ వైస్ చైర్మన్‌గా బాధ్యతల స్వీకరణ



కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక రుడా కార్యాలయంలో రుడా ఇన్‌చార్జ్ వైస్ చైర్మన్‌గా నగర పాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా యాన మాట్లాడుతూ రుడా పరిధిలో వీలైనంత త్వరగా అనుమతులు మంజూరు చేయటానికి చర్యలు తీసుకుంటూ, పరిపాలన పారదర్శకంగా ఉండేలా చూస్తానన్నారు.

సత్తా చాటిన గురుకులం విద్యార్థులు



అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటిన విద్యార్థులతో గురుకులం ప్రిన్సిపాల్ గుర్రయ్య, ఉపాధ్యాయులు

రాజమహేంద్రవరం రూరల్: ఇటీవల యంగ్ ఇన్వాయిస్ ఇంటర్నేషనల్ సంస్థ అంతర్జాతీయ స్థాయిలో ప్రాగ్రెన్స్ ఆఫ్ ఆర్ట్ బడ్స్–2024 పేరుతో నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో తమ పాఠశాలకు చెందిన 15 మంది విద్యార్థులు బంగారు, 29 మంది విద్యార్థులు జ్యూరీ అవార్డులను గెలుచుకుని సత్తా చాటారని రాజమహేంద్రవరం శ్రీసత్య సాయి గురుకులం ప్రిన్సిపల్ కె.గుర్రయ్య ఎ.శ్యాంసుందర్ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో అభినందన కార్యక్రమం ఏర్పాటుచేసి విజేతలైన విద్యార్థులను సత్కరించారు. అనంతరం ప్రిన్సిపాల్ గుర్రయ్య మాట్లాడుతూ తమ పాఠశాలలో విద్యార్థులకు చదువుతో పాటు చిత్రలేఖనంలోనూ తర్ఫీదునిస్తున్నామన్నారు. కరస్పాండెంట్ శ్యాంసుందర్ మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో జరిగిన ఈ పోటీల్లో భారత్‌తో పాటు హంగేరి, రొమేనియా, బల్గేరియా, సెర్బియా తదితర దేశాల నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారన్నారు. పెద్ద ఎత్తున పోటీ ఉన్నా తమ విద్యార్థులు సత్తా చాటి అవార్డులు అందుకోవడం అభినందనీయమన్నారు. అనంతరం చిత్రలేఖనం ఉపాధ్యాయులు మోటూరి శ్రీ, శివాజీలను అభినందించారు.

నిమజ్జనానికి విఘ్నాలు

సీటీఆర్ఐ: విఘ్నాలు తొలగించే వినాయకుడి నిమజ్జనానికి ఆటంకాలు ఏర్పడుతున్నాయి. ఈ నెల 7వ తేదీన వినాయక చవితి సందర్భంగా నగరంలోని వాడవాడలా గణేష్ మండపాలను ఏర్పాటు చేశారు. వినాయక చవితి వేడుకలను నగరంలోని ఆయా ప్రాంతాలను బట్టి మూడు రోజులు, ఐదు రోజులు, ఏడు రోజులు, తొమ్మిది రోజులు జరుపుకోవడం ఆచారంగా వస్తోంది. అయితే బుధవారానికి ఐదు రోజులు పూర్తయిన సందర్భంగా కొందరు తమ గణేష్ విగ్రహాలను నిమజ్జనం చేయడానికి పూనుకున్నారు. అయితే గోదావరి వరద ఉధృతి పెరిగిన నేపథ్యంలో వినాయక నిమజ్జనానికి మరో రెండు మూడు రోజులు ఆగాలంటూ వినాయక మండపాలను ఏర్పాటు చేసిన కమిటీలను అధికారులు కోరుతున్నారు.

వెనక్కి పంపేస్తున్న అధికారులు

గోదావరి గట్టున ఇసుక ర్యాంపు వద్ద ఏటా గణేష్ నిమజ్జనం కార్యక్రమం జరుగుతుంది. అయితే గోదావరికి వరద ఉధృతి పెరగడంతో ఇసుక ర్యాంపు పూర్తిగా వరద నీటితో నిండిపోయింది. దీంతో మంగళ, బుధవారాల్లో రెవెన్యూ, పోలీస్, పంచాయతీ, అగ్నిమాపక, మత్స్య శాఖల అధికారుల సహకారంతో పూర్తిగా ప్రభుత్వ యంత్రాంగం ఆధ్వర్యంలో నిమజ్జనాల కార్యక్రమం చేయాలని నిర్ణయం తీసుకున్నారు. నిమజ్జన సమయంలో ప్రభుత్వం తరపున ఏర్పాటు చేసిన యంత్రాంగానికి విగ్రహాలు అప్పగించి సహకరించాలని కలెక్టర్ ప్రశాంతి విజ్ఞప్తి చేశారు. గోదావరి వరద ఉధృతి పెరగడంతో రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేసిన నేపథ్యంలో నిమజ్జనం చేయడానికి వీలు కాదని, వరద ఉధృతి తగ్గాక నిమజ్జనం చేసుకోవాలంటూ అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఎవరైనా మొండిగా విగ్రహాలను గోదావరి వద్దకు తీసుకొచ్చినా అధికారులు అడ్డుకుని వెనక్కి పంపేస్తున్నారు.

చిన్న మంటపాలకి భారం

పెద్ద పెద్ద మండపాలలో నిర్వహించే వినాయక చవితి వేడుకలు తొమ్మిది రోజులు పాటు నిర్వహిస్తారు. కాని చిన్న మండపాల వారు మాత్రం మూడు రోజులు, ఐదు రోజుల వరకే చవితి వేడుకలకు పరిమితం అవుతారు. అలాంటి వారంతా గోదావరి ఉధృతి తగ్గేంత వరకూ గణేష్ నిమజ్జనం చేయకుండా ఆగాలంటే వారికి ఆర్థికంగా భారంగా మారుతుంది.



గోదావరి వరదతో నీట మునిగిన గణేష్ నిమజ్జన ప్రదేశం

దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టండి

రాజమహేంద్రవరం సిటీ: అధిక వర్షాల కారణంగా నగరంలో దెబ్బతిన్న బీటీ రోడ్లకు తక్షణమే మరమ్మతులు చేపట్టి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని కమిషనర్ కేతన్‌గార్గ్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం నగరంలో దిశ పోలీస్‌స్టేషన్ రోడ్డు, జాగృతి బ్లడ్ బ్యాంక్ నుంచి షెల్టన్ వరకూ రోడ్లను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఆర్యాపురం ఎస్ఆర్‌సీపీ నుంచి ఎస్‌టీపీకు వెళ్లే మురుగునీటి పైప్‌లైన్ లీకేజీను పరిశీలించి త్వరగా మరమ్మతులు చెయ్యాలని ఆదేశించారు. పర్యటనలో ఆయన వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ పాండు రంగారావు, ఇంజినీరింగ్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.